# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 84 EDITOR:CHERUKU UPENDAR, DATE : TUESDAY 25 JULY 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 84 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : మంగళవారం 25 జులై 2023 పేజీలు : 4 వెల : 5/-


## డేంజర్‌లో యమునా నది


న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు



దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది ఉద్ధృతి ఇంకా కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ నుంచి వరద పోటెత్తడంతో యమునా నది ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తోంది. నగరంలోని పాత రైల్వే

మిగతా 3లో...

## మణిపూర్‌పై చర్చకు రెడీ



న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు, హింసాకాండపై సోమవారం (జూలై 24) పార్లమెంట్ ఉభయ సభల్లో పెద్ద దుమారమే రేగింది. దీంతో ఈ విషయంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా వివరణ ఇవ్వాల్సి వచ్చింది. మణిపూర్ సమస్య గురించి సభల్లో చర్చించడానికి తాము రెడీగా ఉన్నామని అమిత్ షా లోక్ సభలో వెల్లడించారు. ఈ అంశంపై చర్చకు సహకరించాలని ప్రతిపక్షాలను అభ్యర్థిస్తున్నానని అమిత్ షా అన్నారు. ఈ సున్నితమైన అంశం గురించి దేశ ప్రజలకు నిజం తెలియడం చాలా ముఖ్యమని అన్నారు. మొత్తానికి సభ్యుల నినాదాలు, గందరగోళం మధ్య లోక్ సభ మంగళవారం (జూలై 25) ఉదయం 11 గంటలకు వాయిదా పడింది.పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా సోమవారం రాజ్యసభ, లోక్‌సభ రెండింటిలోనూ ప్రతిపక్ష సభ్యులు మణిపూర్‌పై ప్రధాని మోదీ ప్రకటన

మిగతా 3లో...




## ట్రయాంగిల్ ఫైట్‌లో..
# జూబ్లీహిల్స్ నియోజకవర్గం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వివిధ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే టిక్కెట్ల కోసం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేతల్లో తీవ్ర పోటీ నెలకొంది. అయితే ఇందుకు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం మినహాయింపు కాదు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి మధ్య ఇటీవల జరిగిన విభేదాలు పార్టీ వర్గాల్లోనూ, అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ తమ ఉనికిని చాటుకునేందుకు అభ్యర్థులు ఎలా ప్రయత్నిస్తున్నారనేది తెలిసింది జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ వ్యక్తిగత సహాయకుడు సుబ్బారావు, ఇతర వ్యక్తులపై ఇటీవల మధురనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బోనాలు వేడుకల బ్యానర్‌పై ఎమ్మెల్యేది ఫొటో చిన్నపాటిది పెట్టారంటూ బీఆర్ఎస్ కార్యకర్త గణేష్‌సింగ్‌పై దాడికి పాల్పడ్డారు. మాగంటి గోపీనాథ్ 2014 ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి టీడీపీ టికెట్‌పై గెలిచి ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. ఆ తర్వాత 2018లో బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసి విజయం సాధించారు. 2018 నుండి పరిస్థితులు మారినట్లు తెలుస్తోంది. మూలాల ప్రకారం.. గోపీనాథ్‌తో పాటు, అదే నియోజకవర్గం నుండి పార్టీ టికెట్ కోసం ఇద్దరు కొత్త అభ్యర్థులు ఉన్నారు. వారిలో ఒకరు టీఎస్ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, మరొకరు మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్.వచ్చే ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి పోటీ

మిగతా 2లో...

## దడ పుట్టిస్తున్న ధరలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

వర్షాలతో సతమతం అవుతున్న జనాలకు కూరగాయల ధరలు మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో చాలా చోట్ల వరదలు ముంచెత్తుతున్నాయి. ముఖ్యండా దేశ రాజధాని ఢిల్లీలో మళ్లీ యమునా నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. హిమాచల్ ప్రదేశ్‌లోనూ వరదలు చుట్టుముట్టాయి.

మిగతా 3లో...

## ఘనంగా
# కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు






హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు


తెలంగాణలో క్రేజ్ ఉన్న పొలిటికల్ లీడర్ కల్వకుంట్ల తారకరామారావు. రాష్ట్రానికి పెట్టుబడులు తేవాలన్నా.. ప్రతిపక్షాలపై పంచ్‌లు పేల్చాలన్నా కేటీఆర్ స్టైలే వేరు. ఆయన స్పీచ్‌లు అంతే అట్రాక్టివ్‌గా ఉంటాయి. నేడు ఆయన జన్మదినం సందర్భంగా.. శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ, ఇండియా మాత్రమే కాదు.. జపాన్‌లో సైతం కేటీఆర్ బర్త్ డే వేడుకలు చేస్తున్నారు. అక్కడి అభిమానులు కేక్ కట్ చేసి.. మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. దీంతోపాటు అమెరికా, యూకే, దుబాయిలోనూ పెద్ద ఎత్తున కేటీఆర్ పుట్టినరోజు జరిపారు.

**అనాధ పిల్లలకు ల్యాప్ టాప్**

జూలై 24వ తేదీ అంటే ఈరోజు రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ 47వ జన్మదినం. ఈ సందర్భంగా

మిగతా 3లో...

## తెలంగాణలో
# కాంగ్రెస్ బలం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో కాంగ్రెస్ ఎదుగుతున్న వైనం చూస్తే వచ్చే ఎన్నికలలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ లానే కనిపిస్తున్నాయి పరిస్థితులు. కన్నడనాట ఎన్నికల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ అనూహ్యంగా బలం పుంజుకుంది. కాంగ్రెస్ ధాటికి బీఆర్ఎస్, బీజేపీలు కుదేలయ్యాయి. రేవంత్ రెడ్డి తో పాటు ఉత్తమ్, భట్టి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు ఒక్కసారిగా ఫుల్ ఆక్టివ్ అయిపోయారు. కాంగ్రెస్ పార్టీ కి తెలంగాణలో గత వైభవం వచ్చినట్టే కనిపించింది. పొంగులేటి, జూపల్లి లు ఏ పార్టీ లో చెరతారో అని నెలల కాలంగా గడిచిన సస్పెన్స్ కు కూడా కాంగ్రెస్ తెరదించింది.

మిగతా 2లో...

## వందకు చేరిన
# పేపర్ లీక్ కేసు నిందితులు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్ వ్యవహారంలో నిందితుల అరెస్ట్ కొనసాగుతోంది. ఈ కేసులో ఇప్పటి వరకు 90మంది నిందితులను సిట్ అరెస్ట్ చేసింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పేపర్ లీక్‌తో మొదలైన కేసు దర్యాప్తు రకరకాల మలుపులు తిరిగింది తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్ వ్యవహారంలో నిందితుల సంఖ్య 100కు చేరువలో ఉంది. ఇప్పటికే ఈ కేసులో 90 మందిని సిట్ దర్యాప్తు బృందం అరెస్టు చేసింది. పేపర్ లీక్ వ్యవహారం మొదట గ్రూప్ వన్ ప్రిలిమ్స్ ప్రశ్నాపత్రాలకు మాత్రమే పరిమితం అయ్యిందని భావించినా మరో నాలుగు పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా లీకైనట్లు అధికారులు గుర్తించారు.పేపర్ లీకేజీ విషయం వెలుగు చూసిన తర్వాత ఈ వ్యవహారంతో ప్రమేయం ఉన్న వారు తప్పించు కోడానికి

మిగతా 3లో...

# ఇక వీఆర్‌ఏ వ్యవస్థల రద్దు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ రాష్ట్ర సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. నీరటి, మస్కూరు, లష్కర్ వంటి పేర్లతో పిలుస్తూ భూస్వామ్య వ్యవస్థకు చిహ్నాలుగా మిగిలిన విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్ఏ) వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏలుగా పనిచేస్తున్న సిబ్బందిని విద్యార్హతల ఆధారంగా ఇతర శాఖల్లో క్రమబద్ధీకరిస్తామని ఆయన తెలిపారు. తొలగించిన వీఆర్ఏలు అందరినీ అర్హతల ఆధారంగా పురపాలక, మిషన్ భగీరథ, నీటిపారుదల తదితర శాఖల్లో సర్దుబాటు చేస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సోమవారం జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని సీఎం కేసీఆర్ ఆదేశించారు. వీఆర్ఏల క్రమబద్ధీకరణ అంశంపై సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కేసీఆర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.'కాలానుగుణంగా కనుమరుగవుతున్న వృత్తుల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ఈ క్రమంలోనే వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేస్తున్నాం. గ్రామాల్లో వ్యవసాయ అభివృద్ధికి నీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించడం, గ్రామ రెవెన్యూ, ఇతర విభాగాల అవసరాల కోసం తొలినాళ్లలో వీఆర్ఏ వ్యవస్థ ఏర్పాటైంది. నేడు మారిన పరిస్థితుల్లో వీఆర్ఏ వృత్తికి ప్రాధాన్యత తగ్గింది. ఈ నేపథ్యంలో వారిని రెవెన్యూ శాఖలో

మిగతా 3లో...

## వివేకా కేసులో ఇంకా ఏముంది
### సీబీఐ వెబ్ సైట్
# స్టోరీపై ట్విస్ట్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన వైఎస్ వివేకానంద రెడ్డి హత్యోదంతంపై సీబీఐ ఫైనల్ చార్జిషీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. మొత్తం 259 మంది సాక్షుల అభిప్రాయాలను

మిగతా 2లో...

## తెలంగాణలో కాంగ్రెస్ బలం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభంజనం లాంటి చేరికతో పొంగులేటి కాంగ్రెస్ పార్టీ లో కొత్త జోష్ నే నింపారు. ఆ తర్వాత వైఎస్సార్టీపీ అధినేత్రి షర్మిల కూడా కాంగ్రెస్ పార్టీ లో చేరుతున్న సంకేతాలు ఇవ్వడంతో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అనే పరిస్థితి తటస్థించింది. అప్పటివరకు ప్రతిపక్ష పార్టీ తామే అని అనుకున్న బీజేపీ మూడో స్థానానికి దిగిపోయింది. వచ్చే ఎన్నికల రేస్ లో బిజెపి అసలు నిలదొక్కుకుంటుందా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అందుకు కారణం కూడా లేకపోలేదు. కర్ణాటక ఎన్నికల తర్వాత అక్కడ బీజేపీ ఓడిపోవడంతో దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాలలో బీజేపీ గ్రాఫ్ పడిపోయింది. ఆ లిస్ట్ లో తెలంగాణ కూడా ఉంది. అప్పటికే పార్టీ లో అంతర్గత కుమ్ములాటలతో ప్రణాళికా లోపాలతో సాగుతున్న బిజెపి ఒక్కసారిగా సైలెంట్ అయిపోయింది. పార్టీ నేతలు, పార్టీ క్యాడర్, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ అందరూ ఎన్నడూ లేని నిశ్శబ్దానికి లోనయ్యారు. ఓ విధంగా చూస్తే తెలంగాణ బిజెపి శ్మశాన వైరాగ్యానికి లోనైందా అని కూడా అనిపించింది. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కడం ఎలా అనుకున్న పార్టీ పెద్దలకి అంతర్గతంగా నెలకొన్న కోట్లాటలకు చెక్ పెట్టాలన్న ఆలోచన కలిగింది. తరచూ ఢిల్లీ వేదికగా జరుగుతున్న కంప్లైంట్ ల పర్వానికి ఫుల్ స్టాప్ పెట్టాలనుకుంది. అదే.. బండి సంజయ్ గత రెండేళ్ల కాలంగా తెలంగాణ మాజీ బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ పై సొంత పార్టీ అభ్యర్థుల నుంచి ఎన్నో ఆరోపణలు వచ్చాయి. నియంత నిర్ణయాలు, పార్టీ పెద్దలకు గౌరవం ఇవ్వకపోవడం, ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకోవడం, బీఆర్ఎస్ పార్టీ కి ఏజెంట్ లా వ్యవహరిస్తున్నాడు అంటూ పదే పదే అతనిపై ఆరోపణలు రేగాయి. బండి సంజయ్ మాత్రం వాటిని ఖాతరు చేయకుండా తన పనిని తాను చేసుకుంటూ పోయాడు. అతను చేస్తున్న పనులు పార్టీ కి ప్లస్సే అవుతున్నాయి కాబట్టి ఇతరుల కంప్లయింట్ లను బేఖాతరు చేస్తూ వచ్చారు ఢిల్లీ పెద్దలు. కానీ.. గత నెల రోజుల్లో జరిగిన పరిణామాలు, పెరుగుతున్న కాంగ్రెస్ గ్రాఫ్ ను చూసి ఒక్కసారిగా నిద్రలేచారు బీజేపీ పెద్దలు. కొట్లాటలతో కొనసాగితే రేస్ లో కాదు కదా.. కనీసం పది స్థానాలు కూడా గెలుస్తామో లేదో అన్న అంచనాలకు వచ్చారు పెద్దలు. వెను వెంటనే.. తెలంగాణ లీడర్లు కోరుకున్న విధంగా మార్పులు చేర్పులకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా ముందు అధ్యక్షుడిని మార్చారు. బండి సంజయ్ ని అధ్యక్ష పదవి నుంచి తప్పించాక ఆ పార్టీ క్యాడర్ లో చీలికలు స్పష్టంగా కనిపించాయి. ఓ వైపు వ్యక్తి భజనకు తావు లేని పార్టీ గా చెప్పుకునే బీజేపీలో బండి సంజయ్ మార్క్ పాలిటిక్స్ కనిపించాయి. అతని నుంచే పార్టీకి లోభం కలిగింది అంటూ బండి క్యాడర్ విపరీతమైన ట్రోల్స్ చేసింది. దాంతో బండి పై విపరీతమైన సింపతీ ఏర్పడింది. రెండు రోజుల క్రితం జరిగిన అధ్యక్ష పదవి స్వీకార కార్యక్రమం లో బండి సంజయ్ బాహాటంగానే తన ఆవేదనని వెలిబుచ్చాడు. అంతే కాకుండా ప్రోగ్రామ్ మధ్యలోనే వెళ్ళిపోయాడు కూడా అని తెలిసింది. తెలంగాణ బీజేపీ సర్కిల్స్ లో కొన్నాళ్ళ పాటు ఈ బండి వేవ్ కొనసాగేలా కనిపిస్తోంది. ఎన్నికల వరకు ఈ చీలికలు కొనసాగితే పార్టీకి నష్టం జరుగుతుందని అనడంలో సందేహం లేదు. ఒక్క బండి సంజయ్ నే కాదు.. బీజేపీ సీనియర్ లీడర్ విజయశాంతి కూడా మొన్న కిషన్ రెడ్డి అధ్యక్ష పదవి ప్రమాణ స్వీకార కార్యక్రమం నుంచి మధ్యలోనే వెళ్లిపోయారు. ఈటెల రాజేందర్ కు ఎన్నికల నిర్వహణ కమిటీ బాధ్యతలు అప్పజెప్పడం, పార్టీ లో దశాబ్దాల కాలంగా ఉన్న తనకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని వ్యతిరేకించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి అదే వేదికపై ఉండటం ఇలా రకరకాల కారణాలు చెప్పి విజయశాంతి వెళ్ళిపోవడం వంటి ఘటనలు జరిగాయి. బండి, విజయశాంతిలు తమ అసంతృప్తిపై బయటపడ్డారు కానీ.. బండి ని తప్పించినందుకు నిరుత్సాహంలో ఉన్న మరికొందరు బయటపడలేకపోతున్నారు అని పార్టీ వర్గాలలో చర్చలు జరుగుతున్నాయి. అధ్యక్షుడు మారిన తర్వాత తమ పరిస్థితి ఏంటని పాత ఆశవహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీళ్లందరినీ ఎవరు సమన్వయం చేసుకుంటూ పోతారు అనేది యక్షప్రశ్న. ఇప్పుడిప్పుడే చేరికల కమిటీ పగ్గాలు చేతికి వచ్చాయి కాబట్టి ఈటెల ఏం చేస్తారు? బండి వర్గం వల్ల పరిస్థితి ఏంటి? కిషన్ రెడ్డి, ఈటెలలు పార్టీ ని సమన్వయంగా ముందుకు తీసుకెళ్తారా? బీజేపీలో గేమ్ స్పిరిట్ తిరిగి నెలకొంటుందా? ప్రస్తుతం నెలకొన్న బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ వంటి వాతావరణాన్ని బీజేపీ మార్చగలుగుతుందా? ఈ ప్రశ్నలకి రానున్న కాలం సమాధానం చెప్తుంది.

## ట్రయాంగిల్ ఫైట్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం

(మొదటిపేజీ తరువాయి)

చేసేందుకు శ్రీధర్‌రెడ్డి, ఫసియుద్దీన్‌లు దూకుడుగా లాబీయింగ్ చేస్తున్నారు. శ్రీధర్ రెడ్డి 2018లో బీజేపీ టికెట్‌పై పోటీ చేసి విఫలమై ఆ తర్వాత భారత రాష్ట్ర సమితిలో చేరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మైనారిటీ వర్గీయుల ప్రభావం గణనీయంగా ఉంది. ఏఐఎమ్‌ఐఎమ్ జూబ్లీహిల్స్ నుంచి తమ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను కూడా బరిలోకి దింపింది. అయినా అతను గెలవలేకపోయాడు. మరి వచ్చే ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ ఎవరిని నిలబెడుతుందో తెలియాలంటే.. మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు.

# వివేకా కేసులో ఇంకా ఏముంది

(మొదటిపేజీ తరువాయి)

సేకరించింది. వివేకా హత్యకు రాజకీయ కారణాలు, కుటుంబ విభేదాలే కారణమని చెప్పింది. అయితే వివేకా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ చాలా అంశాలను వదిలేసిందని ద వైర్ వెబ్‌సైట్ చెబుతోంది..వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు.. ఏపీలో సంచలనం రేపుతోంది..ఈ ఉదంతంపై అధికార ప్రతిపక్షాల మధ్య ఎన్నో ఆరోపణలు, ఎన్నో మాటల యుద్ధాలు జరిగాయి.. ఇలాంటి పరిస్థితుల్లో..సీబీఐ ఫైనల్ ఛార్జ్‌షీట్ ఫైల్ చేసింది. అయితే అందులో చాలా అంశాలు మిస్సయ్యాయని. .సంచలన కథనాన్ని ప్రచురించింది ద వైర్ వెబ్‌సైట్..2019 మార్చి 15 అర్ధరాత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకు గురయ్యారు.. అప్పుడు ఏపీకి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడు.. సాధారణ ఎన్నికలకు నెల ముందు వివేకా హత్య జరిగింది. టీడీపీ నేతలే వివేకాను చంపారని జగన్ ఆరోపించారు.. జగన్‌తో పాటు.. వివేకానంద కుటుంబ సభ్యులు..వివేకా హత్యపై సీబీఐ విచారణ జరగాలని పిటిషన్లు వేశారు.. అయితే అదే సమయంలో.. ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ..సీబీఐని రాష్ట్రంలోకి రాకుండా జీవో జారీ చేశారు.. సీబీఐ దర్యాప్తు చేయాలని 2020 మార్చి 11న ఏపీ హైకోర్టు తీర్పు నిచ్చింది. కేసు నమోదుకు 120 రోజులు తీసుకున్న సీబీఐ.. 2021 అక్టోబర్‌లో మొదటి ఛార్జిషీట్ దాఖలు చేసింది.2020.. ప్రభుత్వం మారింది. జగన్ ముఖ్యమంత్రి అయ్యారు. అదే సంవత్సరం మార్చి 11న ఏపీ హైకోర్టు వివేకా హత్యకేసును సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. అయితే కోర్టు తీర్పు తర్వాత.. కేసు నమోదుకు సీబీఐ 120 రోజులు తీసుకుంది. దర్యాప్తు షురూ చేసిన సీబీఐ 2021 అక్టోబర్లో మొదటి ఛార్జిషీట్ దాఖలు చేసింది.. ఎర్ర గంగిరెడ్డి, యాదవ్, శ్రీ ఉమాశంకర్ దస్తగిరి పేర్లను అందులో నమోదు చేసింది. హత్యకేసులో పలు ఆధారాలను ఉదయ్ కుమార్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, అవినాష్‌రెడ్డిలు చెరిపేశారని..హత్య, కుట్ర సహా పలు సెక్షన్లు పెట్టిన సీబీఐ.. దర్యాప్తును వైర్ వెబ్‌సైట్ అనేక ఎపిసోడ్‌లుగా వివరించింది. దర్యాప్తు పూర్తయ్యిందో లేదోనని వైర్ వెబ్‌సైట్ అనుమానం వ్యక్తం చేసింది.వివేకా హత్యకేసులో సీబీఐ ఛార్జ్‌షీట్ల ప్రకారం దర్యాప్తు పూర్తయ్యిందో లేదో అనుమానమే అంటోంది వైర్. ఎందుకంటే వాటిలోని చాలా అంశాలకు సమాధానం దొరకాల్సి ఉందని చెబుతోంది..వివేకా హత్య జరిగిన 1558 రోజుల తర్వాత సిబిఐ ఫైనల్ రిపోర్ట్ ఇచ్చింది..ఫైనల్ ఛార్జ్‌షీట్ పరిశీలిస్తే..ఎన్నో అంశాలను సీబీఐ వదిలేసినట్లు తెలుస్తోందని వైర్ వర్షన్..సీబీఐ ఛార్జ్‌షీట్‌లోని 8వ పేజీలో 14వ పేరాలో.. హత్య కుట్ర వెనక ఉన్న ఉద్దేశాలపై వివరణ ఉంది..వైయస్ కుటుంబ చరిత్ర అందరికీ తెలిసిందే.. వైఎస్ వివేకా హత్య కడప పార్లమెంట్ సీటు కోసమేనని సీబీఐ ఫైనల్ చార్జ్‌షీట్‌లో తేల్చేసింది. వివేకానంద రెడ్డి కడప ఎంపీ సీటును అవినాష్‌కు కాకుండా.. షర్మిలకు ఇప్పిస్తారేమోననే భయంతోనే వివేకాను హత్య చేశారని ఉంది. ఇంత పెద్ద సెన్సేషనల్ మర్డర్ కేసులో సీబీఐ తేల్చింది ఇదా అంటూ వైర్ వెబ్‌సైట్ కూలంకషంగా ఈ ఉదంతాన్ని స్కానింగ్ చేసి చెప్పింది.2019లో ఎన్నికల కోసం వివేకా యాక్టివ్ అయ్యారట. ఛార్జ్ షీట్ లో సీబీఐ చెప్పిన పొలిటికల్ ఫేస్‌లపై వైర్ ఫోకస్ చేసింది. కొన్ని కారణాల వల్ల ఫైనల్ ఛార్జ్‌షీట్‌లో సీబీఐ వైఎస్ కుటుంబ మూలాలను ప్రస్తావించింది. ఛార్జ్‌షీట్‌లోని 16,23 పేరాల ప్రకారం.. 2017లో ఎమ్మెల్సీగా ఓడిపోయిన వివేకా.. 2019 ఎలక్షన్ల కోసం యాక్టివ్ అయినట్లు ఉంది.. కానీ కడప ఎంపీ టికెట్‌ను అవినాష్ బదులు షర్మిలకు కానీ.. తనకు కానీ.. విజయమ్మకు కానీ ఇవ్వాలని వివేకా చెప్పారు.. వైయస్ అవినాష్ సమర్థుడు కాదంటూనే అవినాష్‌కు జమ్మలమడుగు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరారు..దీనిపై వైర్ వెబ్‌సైట్ ఏమంటోందంటే.. హత్యకు ముందు కొంతకాలం నుంచి వివేకా యాక్టివ్ పొలిటీషియన్ కాదు. హత్య జరిగిన సమయంలో..అంతకుముందు కొంత కాలం నుంచి వివేకా.. యాక్టివ్ పొలిటీషియన్ కాదని వైర్ అంటోంది. బట్ సీబీఐ మాత్రం వివేకా యాక్టివ్ పొలిటీషియన్ అని ఛార్జ్‌షీట్‌లో చెప్పింది..2004 తర్వాత వివేకానంద రెడ్డి రాజకీయాల్లో యాక్టివ్‌గా లేరు. హత్యకు 15 సంవత్సరాలు ముందు మాత్రమే వివేకా పాలిటిక్స్‌లో యాక్టివ్‌గా ఉన్నట్లు వైర్ చెబుతోంది. దీనికి వివేకా ఒక్కగానొక్క కుమార్తె సునీత ఇచ్చిన స్టేట్‌మెంట్లే ఆధారం. హత్య సమయానికే ..తన తండ్రి పాలిటిక్స్‌లో రిటైర్ అయినట్లు రెండుసార్లు సీబీఐకి స్టేట్‌మెంట్లు ఇచ్చారు సునీత.. 2011లో ఓడిపోయాక పాలిటిక్స్ నుంచి వివేకా రిటైర్డ్ హత్యకు ముందు 8 ఏళ్లపాటు పబ్లిక్ మీటింగ్ పెట్టని వివేకా.. విజయమ్మ చేతిలో ఓడిపోయాక వివేకాను పట్టించుకోని కాంగ్రెస్..2011లో విజయమ్మ చేతిలో ఓడిపోయాక..వివేక యాక్టివ్ పాలిటిక్స్ నుంచి రిటైర్ అయినట్లు సునీత స్టేట్‌మెంట్ ఇచ్చారు. 2019లో కడప ఎంపీ సీటు కోసం వివేకా సమర్థుడని చాలా మంది తనతో చెప్పినా..తన తండ్రి మాత్రం అప్పటికే క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నట్లు ఆమె స్టేట్‌మెంట్ ఇచ్చారట. హత్యకు ముందు..ఎనిమిదేళ్ల పాటు.. వివేకా ఎలాంటి పబ్లిక్ మీటింగ్ పెట్టలేదు.. 2011లో కాంగ్రెస్ నుంచి వ్యవసాయ మంత్రిగా ఉన్నప్పుడు మాత్రమే తన ఆఫీసులో ప్రజలతో కలిశారు..ఆ తర్వాత విజయమ్మ చేతిలో ఓడిపోయిన తర్వాత కాంగ్రెస్ వివేకాను పట్టించుకోలేదు.2014 ఎన్నికల్లో అవినాష్ మెజారిటీ 1.90లక్షల ఓట్లు.2019లో మార్చి 10న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. మార్చి 17నే అభ్యర్థుల వివరాలు ప్రకటించాల్సినప్పటికీ.. మృతి కారణంగా మార్చి 19 న అభ్యర్థుల లిస్టును ప్రకటించారు జగన్. ఎన్నికల తేదీల ప్రకటనకు ముందే.. అవినాష్ రెడ్డి ఎంపీగా ఉన్నారు. 2014 కడప ఎన్నికల్లో అవినాష్‌కు 1.90 లక్షల మెజారిటీ ఉంది. అలాంటప్పుడు అవినాష్ వీక్ కాండిడేట్ ఎలా అవుతాడని వైర్ ప్రశ్నిస్తోంది.అవినాష్ ఎన్నికల రికార్డు పరిశీలిస్తే.. ఆయన బలమైన అభ్యర్థి అని వైర్ వ్యాఖ్యానిస్తోంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లోను అవినాష్ రెడ్డి 3.80 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఫ్యాక్షనిస్టు, సీనియర్ రాజకీయ నేత ఆదినారాయణ రెడ్డిని సైం ఓడించారు. మొదట కాంగ్రెస్‌లో ఉన్న ఆదినారాయణ రెడ్డి.. టీడీపీలోకి వచ్చి.. ఆ తర్వాత బీజేపీలో చేరారు.కడప ఎంపీ అభ్యర్థి అవినాషేనన్న వివేకా సోదరి విమల. సునీత భర్త రాజశేఖర్ రెడ్డి సైతం అవినాష్ రెడ్డి ఎంపీ టికెట్ పై సీబీఐకి స్టేట్మెంట్ ఇచ్చారు. అవినాష్ రెడ్డి ఎంపీ అభ్యర్థి అంటూ మర్డర్ కి ముందు అవినాష్ కోసమే వివేకా ప్రచారం నిర్వహించినట్టు రాజశేఖర్ రెడ్డి వాంగ్మూలం ఇచ్చారు. వివేకానంద రెడ్డి సోదరి విమల సైతం కడప ఎంపీ అభ్యర్థి అవినాష్ రెడ్డేనని చెప్పినట్టు వైర్ అంటోంది. కడప ఎంపీ అభ్యర్థి అవినాషేనని.. అవినాష్ కోసమే వివేకానంద రెడ్డి ప్రచారం నిర్వహించారని.. వివేకా సోదరి విమల వైర్‌తో చెప్పారట. అనవసరంగా అవినాన్‌ను ఇబ్బంది పెడుతున్నారని విమల వైర్‌తో అన్నారట. సొంత కుటుంబ సభ్యులే.. వివేకా యాక్టివ్ పాలిటిక్స్ నుంచి రిటైర్ అయ్యారని చెబుతోంటే.. సీబీఐ మాత్రం వివేకా యాక్టివ్ పొలిటీషియన్ అని చెబుతోంది. కుటుంబ సభ్యులు చెబుతున్న వాటిని సీబీఐ ఎందుకు పట్టించుకోవడం లేదని వైర్ అడుగుతోంది.వివేకా హత్య ఎపిసోడ్‌లో సీబీఐ చాలా అంశాలను విస్మరించిందని చెబుతున్న వైర్ ప్రతి అంశాన్ని ఫోకస్ చేసింది. ఛార్జిషీట్‌లో వైఎస్ కుటుంబం మూలాలను కూడా ప్రస్తావించింది సీబీఐ.. వైఎస్ ముత్తాత ఎవరు. అసలు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వివేకానంద రెడ్డి.. జేజమ్మ ఎవరు.. ఇవన్నీ ఛార్జ్‌షీట్‌లో వివరించింది.వివేకా హత్య జరిగిన రెండేళ్లకు.. షర్మిల..జగన్ నుంచి దూరమయ్యారు.. ఆ తర్వాత.. వైఎస్సార్ తెలంగాణ పార్టీ పెట్టిన షర్మిలతో విజయమ్మ కలిశారు. జగన్ షర్మిల మధ్య బేదాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ షర్మిల తో వివేకానంద రెడ్డి కడప సీటు గురించి మాట్లాడారా లేదా అనే దానికి ఎలాంటి ఆధారం లేదు. రాజ్యసభ సీటు విషయంలో అన్నాచెల్లెలి మధ్య అభిప్రాయ బేధాలు ఉండొచ్చు. 2021 జులైలో హైదరాబాద్‌లో షర్మిల పార్టీని స్థాపించారు. అయితే..అన్నా చెల్లెలి మధ్య వివేకా ఏం చెప్పారన్నది ఎవరికీ తెలియదు. వివేకాకు కడప ఎంపీ టికెట్ పై ఎలాంటి అభిప్రాయాలున్నా..వాటిని జగన్ పట్టించుకోకపోయి ఉండొచ్చు.. ఏదేమైనా.. 2011 పరిణామాల తర్వాత.. వివేకానంద రెడ్డి ఆన్‌స్క్రీన్‌లో లేరని వైర్ ఒపీనియన్.అప్పట్లో కాంగ్రెస్‌తో నడిచిన వివేకా.. 2008లో అమెరికా నుంచి వచ్చిన నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి.. 2009లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత ఆ స్థానం నుంచీ పోటీ చేసేందుకు..సోనియాగాంధీ..జగన్‌కు అవకాశం ఇవ్వలేదు.. అదే సమయంలో..వివేకా జగన్‌తో కాకుండా..కాంగ్రెస్‌నే సపోర్ట్ చేశారు..దీనికి బదులుగా వివేకాకు ఎమ్మెల్సీ తో పాటు వ్యవసాయ శాఖ మంత్రి పదవి ఇచ్చారు అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి. అప్పటికే కడప ఎంపీ పదవికి రాజీనామా చేశారు జగన్..కడప ఎంపీ సీటుతో పాటు పులివెందుల అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించారు..ఈ రెండు స్థానాలపై వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి కన్నేశారు.. 2008లోనే అమెరికా నుంచి వచ్చేసిన రాజశేఖర్ రెడ్డి..ఈ రెండిట్లో ఒక స్థానం నుంచి పోటీ చేయాలని.. సోనియాగాంధీని కలవాలని..సునీతతో పాటు కుటుంబమంతా ఢిల్లీ వెళ్లారు. అయితే సోనియా గాంధీ అవకాశం ఇవ్వలేదు.. కానీ..పులివెందుల ఎమ్మెల్యే టిక్కెట్‌ను వివేకాకు ఇచ్చారు సోనియా.. అప్పటికే మంత్రిగా చేసిన వివేకా..వదిన విజయమ్మపై పోటీ చేశారు. వివేకాకు మద్దతుగా ఆయన కుమార్తె సునీత అల్లుడు రాజశేఖర్, మరో అల్లుడు శివప్రకాష్ మద్దతు తెలిపారు. అయితే వదిన చేతిలో ఓడిపోయిన వివేకాను ఆ తర్వాత కాంగ్రెస్ పక్కన పెట్టిందిసీబీఐ ఛార్జ్‌షీట్‌లోని 16, 21 పేరాల ప్రకారం.. 2017 ఎమ్మెల్సీ ఎలక్షన్లో శివశంకర్ రెడ్డి పోటీ చేయాలనుకున్నాడు. కానీ జగన్.. వివేకాకు టికెట్ ఇవ్వడంతో భాస్కర్ రెడ్డి, అవినాష్ రెడ్డి, శివశంకర్ రెడ్డి కలిసి వివేకాను ఓడించారనేది సిబిఐ అభియోగం. తన ఓటమికి ఈ ముగ్గురే కారణమని..వివేకానందరెడ్డి ఈ ముగ్గురినీ తిట్టినట్లు ఛార్జ్‌షీట్‌లో చెప్పారు. ఎన్నికల్లో ఓడిపోతే..రాయలసీమ ప్రాంతంలో సాధారణంగానే ఉద్విగ్న పరిస్థితులు ఉంటాయి. రాయలసీమ ప్రాంతంలో అధికారమే సర్వంగా భావిస్తారు. కానీ సీబీఐ ఛార్జ్‌షీట్‌లో 2017లో ఓటు వేసిన ఏ ఒక్క ఓటర్ స్టేట్మెంటూ తీసుకోలేదు. దాదాపు 800 మంది ఓటర్లు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కానీ ఏ ఒక్క ఓటర్ స్టేట్మెంట్ కూడా ఛార్జ్‌షీట్‌లో పొందుపర్చలేదు..మరోవైపు వివేకానంద మీద గెలిచిన బీటెక్ రవిని సైతం సీబీఐ విచారించలేదు. కాబట్టి..వివేకా హత్యకు రాజకీయ ఉద్దేశ్యాలే కారణమంని సీబీఐ ఎలా చెబుతుందని వైర్ వెబ్సైట్ క్వశ్చన్.. ఇలాంటి ఆధారాలు లేకుండానే హత్యానేరం ఎలా మోపారు..ఎన్నికల ముందు ఎవరైనా హత్యకు పాల్పడతారా..? 2014, 2019 ఎన్నికల్లో అవినాష్ మెజారిటీ లక్షల్లో.. ఎంతో అనుభవమున్న ఒక రాజకీయ నేత తిట్టారని..హత్య చేస్తారా..2019లో వివేకా హత్యకు గురయ్యారు. అప్పుడు ఎన్నికల హడావిడి?ఎన్నికలు ముందు పెట్టుకుని..ఎప్పుడో రెండేళ్ల కింద తమను తిట్టాడని..ఏ లీడర్ అయినా హత్యకు పాల్పడతారా.. 2014, 2019 ఎన్నికల్లో అవినాష్ రెడ్డి లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచారనే విషయాన్ని సిబిఐ మరిచిపోయింది. సీబీఐ ఛార్జ్‌షీట్ ప్రకారం..భాస్కర్ రెడ్డి కుటుంబం ఎప్పుడో రాజకీయాల్లో ఉండాలని అనుకున్నారు. కానీ వైయస్ రాజశేఖర్ రెడ్డి వారిని ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానివ్వలేదు. అదే టైమ్‌లో..తమ్ముడు వివేకా కుటుంబాన్ని రాజశేఖర్ రెడ్డి ప్రోత్సహించారు. దీంతో వైయస్ కుటుంబంలో రాజశేఖర్ రెడ్డి, వివేకా కుటుంబాలే ఆధిపత్యం చెలాయించేవి.. ఇది అందరికీ తెలిసిన విషయమేనని వైర్ చెబుతోంది..వైఎస్ కుటుంబ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే.. వైఎస్ ముత్తాత వెంకటరెడ్డికి ఇద్దరు భార్యలు.. మొదటి భార్య లక్ష్మి.. రెండో భార్య మంగమ్మ..భాస్కర్ రెడ్డి, అవినాష్ రెడ్డి మొదటిభార్య లక్ష్మీ కుటుంబానికి చెందినవాళ్లు.. రెండో భార్య మంగమ్మ కుటుంబానికి చెందినవాళ్లే వైఎస్ఆర్, అండ్ వైఎస్ వివేకా.. భాస్కర్‌రెడ్డికి, వివేకానందరెడ్డికి ముత్తాత ఒకరే అయినప్పటికీ వాళ్ల జేజమ్మలు వేరు.. కాబట్టి జగన్, అవినాష్.. సవతి మనవళ్లు.. అందుకే వీళ్లిద్దరి మధ్య..విభేదాలు ఉన్నాయని సీబీఐ ఛార్జ్ షీట్‌లో చెప్పింది. భాస్కర్ రెడ్డి సోదరి కుమార్తె భారతిని జగన్ వివాహం చేసుకున్నాక..రెండు కుటుంబాల మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయని.. ఈ పెళ్లితో విభేదాలు తగ్గాయని సీబీఐ అంటోంది..రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత వివేకాతో పాటు నర్రెడ్డి కుటుంబం అధికారం కోసం పాకులాడాయి. కానీ జగన్ వెంట నిలిచింది మాత్రం జగన్ భార్య భారతి, భాస్కర్ రెడ్డి కుటుంబం మాత్రమే. జగన్ జైల్లో ఉన్న సందర్భంలో.. పదేళ్ల కష్టకాలంలో వెన్నంటి నడిపించింది భాస్కర్ రెడ్డి కుటుంబమే..ఎక్కువగా పులివెందులలోనే ఉండేవారు.. ఆయనకు హార్ట్ ఆపరేషన్ జరిగి ఆర్నెళ్లు కూడా కాకముందే.. హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె దగ్గరికి వెళ్లిపోయింది వివేకా భార్య. సంవత్సరంలో రెండుసార్లు మాత్రమే సునీత వివేకా దగ్గర ఉండేవారు..నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డికి వివేకాతో వ్యాపార సంబంధాలు ఉన్నాయి కాబట్టి తరచూ కలుస్తుండేవారు..ఇదీ సీబీఐకి సునీత ఇచ్చిన వాంగ్మూలం.. 2011 నుంచి తన తండ్రితో తనకు అంత సఖ్యత లేదని సునీత సీబీఐకి స్టేట్‌మెంట్ ఇచ్చారు.. వివేకా రెండో భార్యనంటూ షమీం అనే మహిళ బయటకొచ్చాక..నాన్నతో దూరంగా ఉంటూ వచ్చాను.. ఏడాదిలో ఒకటి రెండు రోజులు మాత్రమే నా తండ్రిని కలిసేదాన్ని అంటూ సునీత ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో ఉంది. షమీం గురించి తెలిశాక..వివేకా ఇంట్లో గొడవలు మొదలయ్యాయి.నర్రెడ్డి శివప్రసాద్ రెడ్డి రెండు మూడు సార్లు బెదిరించినట్టు షమీం సీబీఐకి స్టేట్మెంట్ ఇచ్చింది. 2011లో అక్బర్ షేక్ గా పేరు మార్చుకున్న వివేకా..షమీంను తన భార్యగా ఇంట్లో వారికి పరిచయం చేశారు.. అప్పటి నుంచీ వివేకా కుటుంబంలో వివాదాలు తారస్థాయికి వెళ్లాయి. షమీం స్టేట్మెంట్ ప్రకారం వివేకా తనని బాగా చూసుకున్నారని చెప్పింది. 2018 హార్ట్ సర్జరీ తర్వాత షమీంతో పాటు తన కొడుకుకు ఏమి చేయలేకపోతున్నానని వివేక బాధ పడినట్లు షమీం ఇచ్చిన రికార్డుల్లో ఉంది. తన కొడుకుకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో అడ్మిషన్ ఇప్పిస్తానని చెప్పారు.. ఒక ఇల్లు కట్టించడంతోపాటు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వ్యవసాయ భూమిని తన కొడుకు మీద రాస్తానని వివేక చెప్పినట్టు సీబీఐ ఎదుట షమీం స్పష్టం చేసింది. షమీం స్టేట్మెంట్ ప్రకారం వివేకా మరణానికి కొన్ని రోజులు ముందే..ఆయనకు చెక్ పవర్ తొలగించారు. దీంతో, వివేకా తీవ్ర ఆందోళనకు గురయ్యారు..వివేకా కేర్ టేకర్ రాజశేఖర్ స్టేట్మెంట్ ప్రకారం..ఆర్థిక ఇబ్బందులతో వివేకానంద రెడ్డి ఆందోళన చెందినట్టు స్టేట్మెంట్ ఇచ్చాడు. చివరి రోజుల్లో ఆర్థిక ఇబ్బందుల వల్ల..దస్తగిరి సునీల్ యాదవ్ లతో వివేకా ఎక్కువగా వ్యాపార లావాదేవీలు నిర్వహించారు. .ఫైనాన్షియల్ టెన్షన్స్‌తో..వివేకా మోతాదుకు మించిన మద్యాన్ని సేవించేవారు. కొన్ని సందర్భాల్లో ఎర్ర గంగిరెడ్డి పై తీవ్రంగా తిట్టేవారు.. వివేకా ఎంత తిట్టినా సరే.. గంగి రెడ్డి మాత్రం వివేకాతోనే తిరిగేవాడు. కొన్ని సందర్భాల్లో..ఫుల్ ప్రెజర్‌తో, టెన్షన్‌తో వివేకా నేలమీదే పడుకునేవారని..కేర్‌టేకర్ రాజశేఖర్ సీబీఐకి వాంగ్మూలం ఇచ్చాడు. వివేకా ఆర్థిక పరిస్థితి గురించి పులివెందులలో చాలామందికి తెలుసు. 8 మంది దగ్గర నుంచి సుమారు ఐదు కోట్ల రూపాయలు వివేక అప్పుగా తీసుకున్నారు. అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఫ్యాక్టరీ కోసం నాలుగు కోట్లు వివేకా ఖర్చు పెట్టారని వైర్ వెబ్‌సైట్ డీటైల్డ్‌గా చెబుతోంది.తన తండ్రికి క్రెడిట్ స్కోర్ లేనందు వల్ల.. తమకు క్రెడిట్ కార్డు రావడం లేదని..అందుకే కొన్ని మార్పులు చేయాలనుకుని..నాన్నకు చెక్ పవర్ తీసేశాము.. అయినా తన తండ్రి పేరు మీద 50 కోట్లు విలువ చేసే ఆస్తులున్నాయి.. తన తండ్రితో పాటు..తన భర్త నిర్వహిస్తున్న వ్యాపారాలకు తాను డైరెక్టర్‌గా ఉన్నానని సునీత సీబీఐకి చెప్పారు .అయితే, వివేకానంద తర్వాత తన భర్త పేరును డైరెక్టర్ హోదా నుంచి తొలగించారు సునీత.. వివేకాకు డబ్బు అవసరమైతే నర్రెడ్డి శివ ప్రసాద్ తో పాటు రాజశేఖర్ ఇచ్చేవారు. వివేక పేరు మీద ఉన్న 93 ఎకరాలను సునీత.. సౌభాగ్యమ్మ పేరు మీదకి మళ్లించారు. ఇక, షమీం డబ్బు కావాలని.. ఎప్పుడూ తమని సంప్రదించలేదని సునీత సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పారు.అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏంటంటే..మొదటి నుంచీ వైయస్ ఫ్యామిలీ క్రిస్టియన్ రెడ్డీస్‌గా కన్వర్ట్ అవ్వడంతో అటు టిడిపి ఇటు బిజెపి వారిపై విమర్శలు చేస్తూ వచ్చేది. వీరికి క్రిస్టియానిటీ నుంచీ ఫండ్స్ ఎక్కువగా వస్తున్నాయని విమర్శలు చేసేవారు. నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి.. యుఎస్ పౌరుడు కావటంతో ఆ సమస్యను పక్కకు పెట్టారు. సీబీఐ చార్జిషీట్లో పేర్కొన్న అంశాలు.. చేసిన ఆరోపణలు చూస్తే కుటుంబ కలహాలు, ఎదుగుదల అడ్డుకోవడమే హత్యకు ప్రధాన కారణాలుగా సిబిఐ అభియోగాలు మోపింది.. కేసు మొత్తాన్ని సీబీఐ డ్రైవర్ దస్తగిరి..వాచ్‌మెన్ రంగన్న స్టేట్మెంట్లతోనే దర్యాప్తు చేసింది.

# డేంజర్‌లో యమునా నది

(మొదటిపేజీ తరువాయి)
బ్రిడ్జి వద్ద 206.42 మీటర్ల ఎత్తులో ఉరకలు వేస్తోంది. ఆదివారంతో పోలిస్తే నీటిమట్టం స్థాయి కాస్త ఎక్కువగానే ఉంది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ లోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా హత్నికుండ్ బ్యారేజీ నుంచి నదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈక్రమంలోనే ఢిల్లీ సర్కారు అప్రమత్తమైంది. ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించింది. ఓల్డ్ యమునా బ్రిడ్జ్ సమీపంలో నది డేంజర్ మార్కు దాటడంతో తీవ్ర స్థాయిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఢిల్లీ నుంచి షహదారా మధ్య రాకపోకలు సాగించే రైళ్లను కూడా రద్దే చేశారు. ప్రస్తుతం ఢిల్లీలో నెలకొన్న పరిస్థితులపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడారు.

# మణిపూర్‌పై చర్చకు రెడీ

(మొదటిపేజీ తరువాయి)
చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ప్రతిపక్షాల నిరసన సమయంలో ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌ను వర్షాకాల సమావేశాలు ముగిసే దాకా రాజ్యసభ ఛైర్మన్ సస్పెండ్ చేశారు. అంతకుముందు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో మాట్లాడుతూ పార్లమెంటులో చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ విషయంపై రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. తాము కూడా చర్చకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ విషయంలో ప్రధాని తన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. 140 కోట్ల మందికి చెందిన ప్రతినిధులు సభ లోపల కూర్చుంటే ముందు ప్రధాని స్టేట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే 3న మణిపూర్‌లో రిజర్వేషన్ డిమాండ్‌పై కుకీ, మైతేయి వర్గాల మధ్య కుల హింస చెలరేగిన సంగతి చెలరేగిన సంగతి తెలిసిందే. ఇందులో ఇప్పటి వరకు 160 మందికి పైగా మరణించారు. గత వారం మణిపూర్‌కు చెందిన మహిళల నగ్న ఊరేగింపు వీడియో వైరల్‌గా మారింది. ఆ తర్వాత దేశమంతా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. మే 3న మణిపూర్‌లో రిజర్వేషన్ డిమాండ్‌పై కుకీ, మైతేయి వర్గాల మధ్య కుల హింస చెలరేగిన సంగతి చెలరేగిన సంగతి తెలిసిందే. ఇందులో ఇప్పటి వరకు 160 మందికి పైగా మరణించారు. గత వారం మణిపూర్‌కు చెందిన మహిళల నగ్న ఊరేగింపు వీడియో వైరల్‌గా మారింది. ఆ తర్వాత దేశమంతా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ సోమవారం ఉదయం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. తెలంగాణలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బండి సంజయ్ కుమార్ కేంద్ర హోం మంత్రితో మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఢిల్లీలో కేంద్ర హోంమంత్రిని కలిసిన అనంతరం బీజేపీ ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో పార్టీ విజయం సాధించేందుకు మంచి పని చేయాలని అమిత్ షా అన్నారు. తెలంగాణలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి మంచి ఫలితాలు వచ్చేలా బీజేపీ వ్యూహం రచిస్తూ ఉంది.

# దడ పుట్టిస్తున్న ధరలు

(మొదటిపేజీ తరువాయి)
ఫలితంగా పంట నష్టం వాటిల్లింది. ఇప్పటికే ఈ ప్రభావం టమాటా ధరల రూపంలో చూస్తూనే ఉన్నాయి. రోజువారీ వంటల్లో వినియోగించే టమాటాల ధరలు పెరగడం వల్ల చాలా మంది వాటిని కొనడమే తగ్గించారు. ప్రస్తుత వరదల కారణంగా ఒక్క టమాటానే కాకుండా అన్ని కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కొత్తిమీర కట్ట నుంచి అల్లం, సొరకాయ, క్యాప్సికమ్ ప్రియమైపోయాయి. గత నెల రోజుల్లోనే కూరగాయల ధరలు 20-40% వరకూ పెరిగాయి. ఫలితంగా...సామాన్యుడి బడ్జెట్ తలకిందులవుతోంది. ఢిల్లీ లో వరదల కారణంగా పలు రాష్ట్రాలకు కూరగాయ సరఫరా ఆగిపోయింది. యమునా నదీ తీర ప్రాంతాల్లోని పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. పండ్ల సాగుపైనా ప్రభావం పడింది. గ్రాసరీ స్టోర్‌లలో కొన్ని కూరగాయలు అసలు అందుబాటులో ఉండడం లేదు. అరటి కాయలు ఒక్కొక్కటి 20 రూపాయలు చెబుతున్నారు. మునక్కాయలు అయితే ఒకటి పది రూపాయలు చెబుతున్నారు. ఆకు కూరల సంగతి సరే సరి. ఒకప్పుడు 20 రూపాయలు ఇస్తే ఇంటిల్లపాది ఏదైనా ఆకుకూర తినేటోళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రెండు చిన్న చిన్న కట్టలు కట్టి 20 రూపాయలు చెబుతున్నారు. గట్టిగా తింటే ఒకరి కూడా సరిపోని పరిస్థితి ఉంది. పాలకూర, తోటకూర, గోంగూర, బచ్చల కూర ఇలా ఏ ఆకు కూర తీసుకున్నా ఇదే పరిస్థితి. కొత్తిమీర, పుదీనా అయితే వాసన చూడటానికి కూడా వీల్లేనంతగా పెరిగిపోయింది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసినా అవి మార్కెట్‌కి మించి డబ్బులు వసూలు చేస్తున్నాయి. నిజానికి బయటి మార్కెట్‌తో పోల్చుకుంటే కొన్ని వెజిటెబుల్స్ ధరలు ఆన్‌లైన్‌లో తక్కువగా ఉంటాయి. కానీ..ఇప్పుడు అవి కూడా ప్రియమైపోయాయి. గ్రేటర్ నోయిడాలో కిలో టమాటా ధర రూ.250కి చేరుకుంది. అల్లం ధరలూ దడ పుట్టిస్తున్నాయి. కిలో రూ.300కి తగ్గడం లేదు. సొరకాయ, బెండకాయ, కాలీఫ్లవర్ కూడా టమాటాతో పోటీ పడుతున్నాయి. ఈ ధరల పెరుగుదల కారణంగా గతంలో కిలో కొనేవాళ్లు ఇప్పుడు అరకిలోతో సరిపెట్టుకుంటున్నారు. అత్యవసరమైతే తప్ప ఎక్కువ కూరగాయలు కొనడం లేదు. ఉన్నవాటితోనే ఎలాగోలా వండుకుంటున్నారు. కిలో బెండకాయ రూ.60-100 వరకూ పలుకుతోంది. సొరకాయ కిలో రూ.50 వరకూ ఉంటోంది. ఇక సుగంధ ద్రవ్యాల ధరలూ ఇలాగే మండి పోతున్నాయి. ఉప్పు, నూనె, పప్పులు, చక్కెర ధరలూ పెరిగాయి. కిలో ఉప్పు ప్యాకెట్ రూ.24 ఉండగా..ఇప్పుడది చాలా చోట్ల రూ.30-35 వరకూ పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో రెండు మూడు నెలలుగా ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఊహించిన దాని కంటే ఎక్కువ వర్షపాతం నమోదవడం వల్ల భారీ నష్టం వాటిల్లింది. యాపిల్స్ ఓ బాక్స్ ధర గతంలో రూ.1,200 ఉండగా..ఇప్పుడది రూ.1,500 వరకూ పెరిగిపోయింది.

# ఇక వీఆర్ఏ వ్యవస్థల రద్దు

(మొదటిపేజీ తరువాయి)
క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకుంటున్నామని' సీఎం కేసీఆర్ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 20,555 మంది వీఆర్ఏలు పనిచేస్తున్నారు. వారిలో నిరక్షరాస్యులతోపాటు ఏడో తరగతి, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఉన్నత చదువులు చదివినవారూ ఉన్నారు. వారి విద్యార్హతల ఆధారంగా ఉద్యోగ కేటగిరీలను నిర్ధారించి ఆయా శాఖల్లో భర్తీ చేస్తాం. ఉన్నత చదువులు చదివి ప్రమోషన్లకు అర్హులైన వారిని అందుకు అనుగుణమైన పోస్టుల్లో నియమిస్తాం. అలాగే 61 ఏళ్ల వయసుపైబడిన వీఆర్ఏల వారసులకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. దీనితోపాటు 61 ఏళ్లలోపు వయసు ఉండి 2014 జూన్ 2న తర్వాత ఏదైనా కారణంతో మరణించిన వీఆర్ఏల వారసులకు కూడా ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ఆయన ప్రకటించారు. వీరి వివరాలను త్వరగా సేకరించి వారి అర్హతలు, ప్రభుత్వ నిబంధనల మేరకు వివిధ శాఖల్లోని ఉద్యోగాల్లో సర్దుబాటు చేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు.

**నాలుగు వ్యవస్థల్లో సర్దుబాటు**

ఆర్ఏ వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేస్తూ సీఎం కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. భూస్వామ్య వ్యవస్థకు చిహ్నాలుగా ఉన్న వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వీఆర్ఏలుగా పనిచేస్తున్న ఉద్యోగులను రెవెన్యూ శాఖలో సూపర్ న్యూమరరీ పోస్టుల్లో క్రమబద్ధీకరించనున్నట్టు వెల్లడించారు. వీఆర్ఏలు ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్దీకరణ చేస్తున్నామని సీఎం కేసీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 20,555 మంది వీఆర్ఏలు పనిచేస్తున్నారన్నారు. వీరిలో నిరక్షరాస్యులు, వివిధ విద్యార్హతలు కలిగిన వారు ఉన్నారన్నారు. అందువల్ల విద్యార్హతను బట్టి ఉద్యోగ కేటగిరీలను నిర్ధారిస్తామని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా వారందరినీ వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తామని సీఎం తెలిపారు. ఉన్నత చదువులు చదివి ప్రమోషన్లకు అర్హులైన వారికి, వారి విద్యార్హతకు తగిన పోస్టుల్లో భర్తీ చేయనున్నట్టు సీఎం ప్రకటించారు. 61 ఏండ్లు పైబడిన వీఆర్ఏలు వారి వారసులకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయించారు. జూన్ 2, 2014 నాటికి 61 ఏండ్ల లోపు ఉండి ఏ కారణం చేతనైనా వీఆర్ఏ విధులు నిర్వహిస్తూ మరణిస్తే... వీఆర్ఏ వారసులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. చనిపోయిన వీఆర్ఏల వారసుల వివరాలు, వారి విద్యార్హతలు త్వరలోనే సేకరించాలని అధికారులను ఆదేశించారు. వీరిని కూడా నిబంధనల అనుగుణంగా వివిధ శాఖల్లో సర్దుబాటు చేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు.

## ఘనంగా
# కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)
మంత్రి కేటీ రామారావు యూసుఫ్ గూడలోని స్టేట్ హోమ్‌లో 10, 12 తరగతుల్లో ప్రతిభ కనబరిచిన 47 మంది విద్యార్థులకు వ్యక్తిగతంగా చేయూత ఇచ్చారు. 'గిఫ్ట్ ఎ స్మైల్' కింద ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న మరో 47 మంది పిల్లలకు కూడా మద్దతుగా నిలిచేందుకు సిద్ధమయ్యారు. ట్విట్టర్ వేదికగా తన ప్లాన్ వివరించారు కేటీఆర్. ప్రతీ ఒక విద్యార్థికి ల్యాప్ టాప్ తో పాటు రెండేళ్ల కోచింగ్ ఇప్పిస్తానని ప్రతిజ్ఞ చేశారు. తన పుట్టిన రోజు నాడు ప్రకటనలపై డబ్బు ఖర్చు పెట్టడం కంటే అనాథ పిల్లలకు సాయం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. తమ కలల సాకారం కోసం నిత్యం పరితపిస్తున్న విద్యార్థులే రాష్ట్ర సంపద అని వెల్లడించారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాయా) ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులో నీరా కేఫ్ పాయింట్ వద్ద కేక్ ను కట్ చేశారు. అనంతరం సైక్లింగ్ స్పోర్ట్స్ మీట్ ను చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ గారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నీరా కేఫ్ లో.. రాష్ట్ర ప్రభుత్వ వివిధ కార్పొరేషన్ చైర్మన్లు పల్లె రవికుమార్ గౌడ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, బీసీ కమిషన్ సభ్యులు కే. కిషోర్ గౌడ్, అర్జున అవార్డు గ్రహీత అనూప్, మాజీ చైర్మన్ జి. శ్రీనివాస్ యాదవ్, సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి, కార్యదర్శి దత్తాత్రేయ, మర్రి లక్ష్మారెడ్డి, ప్రేమ్ రాజ్, క్రీడాకారులతో కలిసి ఆరోగ్య ప్రదాయిని నీరాను త్రాగారు. నీరాలో ఉన్న ప్రకృతి సిద్ధమైన ఔషధ గుణాలు ఆరోగ్యానికి చాలా మంచివని తెలిపారు. నీరా కిడ్నీ, క్యాన్సర్ వంటి రోగాలు రాకుండా కాపాడుతుందనీ మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్ వివారించారు. బీఆర్ఎస్ పార్టీ నేత అలిశెట్టి అరవింద్.. మంత్రి కేటీఆర్ కు వినూత్న రీతిలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 12 అడుగుల ఎత్తు 45 అడుగుల వెడల్పు కలిగిన భారీ బస్సుకు ఇరువైపులా మంత్రి కేటీఆర్ సారథ్యంలో సాధించిన విజయాలను వివరిస్తూ రాసి ఉన్న పోస్టర్ ను కట్టారు. టీ హబ్, దుర్గం చెరువు ఫ్లైఓవర్, టీ వర్క్స్, నగరంలోని పలు ఫ్లైఓవర్లను ఇందులో పొందుపరిచారు. ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన ఈ వాహనం పది రోజులపాటు నగరంలోని వివిధ ప్రాంతాలలో సంచరిస్తుంది. మాటల్లో కాదు అతి తక్కువ కాలంలో అభివృద్ధిని చేసి చూపించిన తమ నేత కలకాలం ఆయురారోగ్యాలతో జీవించాలని ఆ భగవంతుని వేడుకుంటున్నట్లు అలిశెట్టి పేర్కొన్నారు.

**వరినాట్లు నాటి పుట్టిన రోజు శుభాకాంక్షలు**

పాలకుర్తి మండలం లింగాపూర్ గ్రామంలో ఇండ్ల నరేష్-స్వప్న పొలంలో కేటీఆర్ పై ఉన్న అభిమానాన్ని జడ్పీటీసీ కందుల సంధ్యారాణి , రైతులతో కలిసి వినూత్నంగా తెలియజేశారు. ఇటీవల రైతు బంధు , రైతుబీమా పథకాలతో కాళేశ్వరం లాంటి మహా ప్రాజెక్ట్ నిరంతరం ఉచిత కరంటుతో రైతుల కష్టాలు తీర్చిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పురపలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారరామారావు జన్మదినం పురస్కరించుకొని వినూత్న తరహాలో శుభాకాంక్షలు తెలిపారు.

బిఆర్ఎస్ పార్టీ సంక్షేమ ఫలితాల వల్లనే రైతులు ఈరోజు ఆనందంగా ఉన్నారని తెలియజేస్తూ కందుల సంధ్యారాణి ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతులు వరినాట్లతో హ్యాపీ బర్డే కేటీఆర్ అనీ అక్షరాలు వరినాట్లు నాటి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ రైతులు సుఖసంతో షాలతో ఉన్నారంటే బిఆర్ఎస్ పార్టీ కేసిఆర్ పాలన అన్నారు తండ్రి కి తగ్గ తనయు డిగా పాలనలో, ప్రజాసేవలో ముందుకు వెళ్తున్న కేటీఆర్ రైతుల, ప్రజా దీవెనలు అందుకుంటూ ముందుకు వెళ్తున్నాడు అని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు కేటీఆర్ అందుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో సరోజ శారధ భాగ్య శ్యామల అమీన విజ్జక్క, రమ, లచ్చమ్మ,సత్తమ్మ సరోజన,సునీత ,హరీష్,ప్రశాంత్,బబ్లు తదితరులు పాల్గొన్నారు.

# వందకు చేరిన పేపర్ లీక్ కేసు నిందితులు

(మొదటిపేజీ తరువాయి)
రకరకాల ప్రయత్నాలు చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన భార్యాభర్తలు సిమ్‌కార్డులు మార్చేసి పుణ్యక్షేత్రాలకు తిరిగారు. చివరకు పోలీసులకు చిక్కి నేరం అంగీకరించారు. వారు ఇటీవల బెయిల్‌పై బయటకొచ్చారు. ఈ కేసులో సాంకేతిక ఆధారాలు లభించడంతో తప్పించుకోలేమనే ఉద్దేశంతో తప్పు చేశామని ఒప్పుకుని లొంగిపోతున్నారు. కేసు దర్యాప్తు తుది దశకు చేరడంతో గత 20 రోజుల వ్యవధిలో 15 మంది తమ తప్పును అంగీకరించి లొంగిపోయారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రవీణ్, రాజశేఖర్‌లతో మొదలైన అరెస్టులు ఆ తర్వాత కొనసాగుతున్నాయి. ఈ కేసులో ఇప్పటివరకు 90 మంది నిందితులను అరెస్ట్ చేశారు. మరో 10 మందిని నెలాఖరులోగా అరెస్ట్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన వెంటనే న్యాయస్థానంలో మరో ఛార్జిషీట్ దాఖలు చేస్తామని సిట్ అధికారులు వివరించారు. ఈ ఏడాది మార్చిలో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు బహిర్గతమైనట్టు బేగంబజార్ పోలీసులకు సమాచారం అందింది. ప్రాథమిక దర్యాప్తులో లభించిన సమాచారం ఆధారంగా తొలుత 12 మందిని అరెస్ట్ చేశారు. కమిషన్ కార్యదర్శి వ్యక్తిగత సహాయకుడు ప్రవీణ్‌కుమార్‌ను పేపర్‌లీక్ వ్యవహారానికి సూత్రధారిగా తేల్చారు. నెట్‌వర్క్ అడ్మిన్ రాజశేఖర్‌రెడ్డి సాయంతో పేపర్లు లీక్ చేసి విక్రయించినట్లు గుర్తించారు. కేసు సిట్‌కు బదిలీ అయ్యాక పోలీసులు ఇందులో ఒకరి నుంచి మరొకరికి ఉన్న లింకులను ఛేదిస్తూ 30 మందిని గుర్తించారు. కమిషన్ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ ఇన్‌ఛార్జి శంకరలక్ష్మి డైరీ నుంచి తాను ఐడీ, పాస్‌వర్డ్ తస్కరించినట్టు ప్రవీణ్‌కుమార్ పోలీసుల దర్యాప్తులో వెల్లడించినా, ఆమె డైరీలో ఈ వివరాలు ఉన్నట్లు ఆధారాలు లభించలేదు. దీంతో హ్యాకింగ్ ఇతర మార్గాల్లో అక్రమంగా ప్రశ్నాపత్రాలు సేకరించి ఉంటారని అనుమానిస్తున్నారు.

# 30న పీఎస్ఎల్‌వీ సీ56 ప్రయోగం

**శ్రీహరికోట- ప్రభాత సూర్యుడు**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమవుతున్నది. ఈ నెల 30న పీఎస్ఎల్‌వీ సీ56 ప్రయోగం చేపట్టనుంది. ఏపీలోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్‌ధవన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి 30న ఉదయం 6.30 గంటలకు సింగపూర్‌కి చెందిన డీఎస్-ఎస్ఏఆర్ ఉపగ్రహంతోపాటు మరో ఆరు శాటిలైట్లను నింగిలోకి పంపనున్నట్టు ఇస్రో సోమవారం వెల్లడించింది. సింగపూర్ ప్రభుత్వ ఏజెన్సీలకు ఉపగ్రహ ఛాయాచిత్రాల అవసరాల నిమిత్తం డీఎస్-ఎస్ఏఆర్‌ను ప్రయోగిస్తున్నారు. డీఎస్ ఎస్ఏఆర్‌తోపాటు టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ మైక్రో శాటిలైట్ వెలాక్స్-ఏఎం, ఎక్స్‌పరిమెంటల్ శాటిలైట్ 'ఆర్కేడ్', 3యూ నానోశాటిలైట్ 'స్కూబ్-2', ఐవోటీ కనెక్టివిటీ నానోశాటిలైట్ 'నూలయన్', గలాసియా-2, ఓఆర్‌బీ-12 స్ట్రైడర్ శాటిలైట్లను కూడా రోదసిలోకి పంపనున్నారు. చంద్రుడిపై పరిశోధనల కోసం ఇస్రో ఇటీవలే చంద్రయాన్-3ని విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే.



# వొడితల విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి హరీష్ రావు



హుజూరాబాద్- ప్రభాత సూర్యుడు

హుజూరాబాద్ పట్టణంలో మాజీ ఎంపీ వొడితల రాజేశ్వరరావు విగ్రహావిష్కరణ మహోత్సవానికి హాజరై విగ్రహాన్ని రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్, మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, తెలంగాణ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు సతీష్ కుమార్ ,రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి, తెలంగాణ ట్రాన్స్కో జెన్కో సీఎండి ప్రభాకర్ రావు, స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ రాజేశ్వర రావు విగ్రహావిష్కరణ నా చేతుల మీదుగా జరగడం ఎంతో అదృష్టం. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్రం ఎందుకు కావాలో తన వ్యాసాల్లో వివరించేవారు. నిజంగా వొడితెల డీఎన్ఏ లోనే తెలంగాణ జీన్స్ ఉంది అని చెప్పక తప్పదు. సర్పంచ్ నుంచి ఢిల్లీ దాకా ఎదిగినా తన హుజురాబాద్ ,సింగాపురంను ఎప్పుడు మరిచిపోలేదు. లీడర్లు, ప్రజాప్రతినిధులు, నక్సలెట్లు అంటే భయపడతారు. కానీ నక్సలైట్లు కూడా రాజేశ్వర్ రావును ఇష్టపడేవారు. ఒక అద్భుతమైన కుటుంబం. ముగ్గురు అన్నదమ్ముల మధ్య ఎంతో ప్రేమ ఆప్యాయత పంచేవారు. ఒక వైపు డయాలిసిస్ నడుస్తుంటే మరో చేతితో తెలంగాణ ఉద్యమం గురించి వ్యాసాలు రాసేవారు.కేసీఆర్ రాజేశ్వర్ రావు మధ్య ఎనలేని అనుబంధం ఉండేది.

సింగపూర్ రాజేశ్వర్ రావు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యుడిగా, కరీం నగర్, వరంగల్ జిల్లాలకే కాకుండా రాష్ట్రానికి వివిధ హోదాల్లో సేవలందించారు.కాంగ్రెస్ లో ఉంటూ తెలంగాణ వాదాన్ని గట్టిగా వినిపించిన వ్యక్తి .తెలంగాణ ఉద్యమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఊపిరిలూదిన వ్యక్తి రాజేశ్వర్ రావు.ఈ ప్రాంతంలోని 40 గ్రామాల్లో 33 యేండ్ల కిందటే శుద్ధ తాగు జలాలు ప్రజలకు అందించేందుకు ఫిల్టర్ బెడ్ నిర్మించిన వ్యక్తి రాజేశ్వర్ రావు. ప్రజలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఆకాలంలోనే కేజీ టూ పీజీ విద్యాసంస్థలను స్థాపించిన దార్శనికుడు రాజేశ్వర్ రావని కొనియాడారు. 1990లలోనే ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాలను నెలకొల్పి ఏంతో మంది సాంకేతిక నిపుణలను సమాజానికి అందించిన మహాను భావుడు రాజేశ్వర్ రావు. రాజేశ్వర్ రావు తెలంగాణకు విద్యనందించడంలోనే కాదు ఉద్యమ వ్యాప్తి లోనూ తన వంతు సహాయ సహకారాలు అందించేవారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధించి రాజేశ్వర్ రావు హైద్రాబాద్ నివాసంలో లెక్క లేనన్నీ మీటింగ్ లు జరిగాయి. ఢిల్లీలో తనకున్న పరిచయాలను రాజేశ్వర్ రావు తెలంగాణ భావ వ్యాప్తికి విస్తృతంగా వాడారు. కాంగ్రెస్ పార్టీలో తెలంగాణ వాదులను సంఘటితం చేసేందుకు చివరిదాకా శ్రమించారని అన్నారు. లక్ష్మి కాంతరావు టీఆర్ఎస్ లో రాజేశ్వర్ రావు కాంగ్రెస్ లో ఉన్నా తెలంగాణ కోసం వారిద్దరూ చేసిన మేలు ఎంతో విలువైనది. బీఆర్ఎస్ కు ఇక్కడ బలమైన పునాదులు ఏర్పరిచింది వొడితల కుటుంబమే అని చెప్పక తప్పదని అన్నారు.

# నూజివీడులో వీధి కుక్కల హల్ చల్

నూజివీడు- ప్రభాత సూర్యుడు

నూజివీడు మున్సిపాలిటీలో కుక్కలు వీర విహారం చేస్తూన్నాయి. అప్సర థియేటర్ వెనక, రామాలయం గుడి సెంటర్, బీఫార్మసీ కాలేజ్ బాపునగర్లో ఒకే కుక్క ఏడుగురు మీద దాడి చేసింది. వేరువేరు చోట్ల దాడి చేసింది. కార్తీక్ సింగ్(8) టీ,సాయి (12)ఇంకో పాప బంగినపల్లి తోట (11), టీ.హేమలత (35)లకు గాయాలయ్యాయి. నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో నలుగురికి చికిత్స అందించారు. ముగ్గురు ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నట్లు సమాచారం.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించే వీధి కుక్కలపై చర్యలు తీసుకొని పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.కుక్క కాటుకు గురైన బాధితులను స్థానిక తాహాసిల్దార్ ఎల్లారావు పరామర్శించారు.

# డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించిన కానిస్టేబుల్ అభ్యర్థులు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

లకడికాపుల్‌లోని డీజీపీ కార్యాలయాన్ని కానిస్టేబుల్ అభ్యర్థులు సోమవారం ముట్టడించారు. రోడ్డు పై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వారిని పోలీసులు అరెస్టు చేసారు. ఈనేపథ్యంలో ఇరువురికి తోపులాట, వాగ్వివాదం జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. 2022 నోటిఫికేషన్ లో కానిస్టేబుల్ నియామకాల్లో తీసుకువచ్చిన జీవో నెంబర్ 46 రద్దు చేయాలని డిమాండ్ చేసారు. పాత పద్ధతిలో నియమాలను చేపట్టి... గ్రామీణ ప్రాంత విద్యార్థులకు న్యాయం చేయాలని... జీవో 46 వల్ల తీవ్రముగా నష్టపోతామని అన్నారు.

## సంక్షేమ కార్యక్రమాల

# యూనిట్లను త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలి

## జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా





జగిత్యాల - ప్రభాత సూర్యుడు

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన యూనిట్లను త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు.సోమవారం రోజున సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలను దళిత బంధు, ఎస్సీ, బి.సి, మైనారిటీ పథకాలకు సంబంధించిన లబ్దిదారుల యూనిట్లను వెంటనే గ్రౌండింగ్ చేయాలని అన్నారు. రెండవ విడుత గొర్రెల యూనిట్లను గ్రౌండింగ్ చేసి, అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా లక్ష రూపాయల యూనిట్లను గ్రౌండింగ్ చేయలని అన్నారు. ఇటీవల మైనారిటీలకు ముఖ్యమంత్రి ప్రకటించిన లక్ష రూపాయల యూనిట్ కు ప్రభుత్వం త్వరలో విధి విధానాలు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. దళిత బంధు కింద నియోజకవర్గానికి 1,100 చొప్పున లబ్దిదారుల ఎంపిక ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపిక చేయాలని సూచించారు. అవసరమైన భూముల కేటాయింపుపై ఆర్డిఒలు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్ లో వ్యాధులు ప్రబలకుండా పంచాయతి, మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండి పారిశుధ్య కార్యక్రమాలు, నీటి నిల్వలు లేకుండా సరిచేయాలని అన్నారు. ఫాగింగ్, రసాయనాల పిచికారి నిరంతరం కొనసాగించాలని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, భోజనానికి ముందు చేతులు శు భ్రపరుచునే పద్ధతిని ఆయా విద్యాసంస్థల అధికారులు, యాజమాన్యం వివరించాలని అన్నారు. హరిత హారం కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులకు కేటాయించిన లక్ష్యాలలో మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, మొక్కలు నాటడానికి సరైన సమయమని అన్నారు. ఇంటింటి మొక్కల పంపిణి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు పంపిణి చేసిన మొక్కల వివరాలను హరిత హారం పోర్టర్ లో అప్ లోడ్ చేయాలని అన్నారు. పంచాయతి భవనాల నిర్మాణాలు, సబ్ సెంటర్ భవన నిర్మాణాలను ఆయా ఏజెన్సీలు త్వరితగతిన పూర్తీ చేయడానికి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. మన ఊరు-మనబడి కార్యక్రమం కింద చేపడుతున్న పనులను వెంటనే పూర్తీ చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, దివాకర్, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహోన్నత విద్యా స్ఫూర్తి ప్రదాత.. డాక్టర్ బిఎస్ రావు

## సంస్మరణ సభలో తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్

ఖమ్మం- ప్రభాత సూర్యుడు

'శ్రీ చైతన్య' ఇండియా విద్యాసంస్థల ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బి.ఎస్ రావు స్ఫూర్తిదాయకులని, ఆయన చూపిన మార్గం లక్షలాదిమంది విద్యార్థులలో వెలుగులు నింపాయని, కోట్లాదిమంది విద్యా కుసుమాలకు ఆదర్శప్రాయులయ్యారని 'తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల' చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ కొనియాడారు. ఖమ్మం నగరంలోని స్వర్ణ భారతి కమ్మవారి కల్యాణ మండపంలో డాక్టర్ బి.ఎస్ రావు సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బిఎస్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 'తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల' చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ... డాక్టర్ బిఎస్ రావు అకాల మరణం చాలా బాధాకరమని, విద్యావ్యవస్థలను మహోన్నత స్థాయికి తీసుకువెళ్లడం ఆయనకే సాధ్యమైందని అన్నారు.చిన్నపాటి విద్యాసంస్థను నెలకొల్పి, దేశవ్యాప్తంగా నలుదిక్కులా వందలాది స్కూళ్లను, జూనియర్ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలను స్థాపించి, లక్షలాది మంది విద్యార్థులకు వెలుగులు నింపారని కొనియాడారు. దేశవ్యాప్తంగా 'శ్రీ చైతన్య'ను ఒక తిరుగులేని విద్యా శక్తిగా తయారుచేసిన రూపశిల్పి డాక్టర్ బి.ఎస్ రావు అని అన్నారు.ఈ సందర్భంగా 'శ్రీ చైతన్య' విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య మాట్లాడుతూ.. ఆశయ సాధన కోసం అనుక్షణం



శ్రమిస్తూ, ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు ఎదగాలనే సంకల్పంతో 'డాక్టర్ బి.ఎస్ రావు' నిరంతరం శ్రమించారని అటువంటి మహోన్నతమైన వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరమని అన్నారు. శ్రీ చైతన్య విద్యా సంస్థలను ఒక దేవాలయంలా మార్పు చేశారని, అటువంటి మహనీయులు మాకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకులని, కోట్లాదిమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని కొనియాడారు.ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల హృదయ్ స్కూల్ చైర్మన్ సాంబశివరెడ్డి, చింతనిప్పు రామకృష్ణ, చింతనిప్పు శ్రీదేవి, శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల సీఈవో శ్రీనివాస్, కాలేజీ డీన్స్, ఏజీఎంఎస్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పాఠశాల డీన్స్, ఏజీఎంఎస్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నియమాలు పాటించని వారిపై ప్రత్యేక దృష్టి




జగిత్యాల - ప్రభాత సూర్యుడు

మద్యం తాగి వాహనాలు నడుపుతున్న,ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సాధించిందని జగిత్యాల ఇన్స్పెక్టర్ రఫిక్ ఖాన్ ఆన్నారు.. సోమవారంజిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు స్థానిక ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్లో మద్యం సేవించి వాహనాలు నడిపి, ట్రాఫిక్ నియమాలు పాటించని 26 మందికి ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్లో గల కౌన్సిలింగ్ సెంటర్ లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ రఫిక్ ఖాన్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం రోడ్డు పైకి వస్తుందని, యజమాని లేని కుటుంబం చిన్నాభిన్నం అయిపోతుందని, ఎట్టి పరిస్థితుల్లో కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పక ధరించాలని అన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన 'తెలంగాణ ట్రై క్రీడా వేడుకలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రివర్యులు కె. తారక రామారావు గారి జన్మదినం సందర్భంగా ఈరోజు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ట్రై క్రీడా వేడుకలు నెక్లెస్ రోడ్ వద్ద ఘనంగా ప్రారంభమైనాయి. తదుపరి ఇందిరా పార్కులో రోలల్ స్కేటింగ్ పోటీలను మంత్రి శ్రీనివాస్ గౌడ్, చై?ర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ ప్రారంభించి స్కేటర్లను ఉత్సాహపరిచారు. మధ్యాహ్నం యూసుఫ్‌గూడా, కెవిబిఆర్ ఇండోర్ స్టేడియంలో మహిళల రెజ్లింగ్ పోటీలు చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, గౌరవ కేసీఆర్ గారి అడుగుజాడల్లో నడుస్తూ రాష్ట్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న యూత్ ఐకాన్ కేటీఆర్ గారి జన్మదినం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించుకోవడం సంతోషకరమని అన్నారు. చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సైక్లింగ్ స్కేటింగ్, రెజ్లింగ్ అంశాలలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు క్రీడాకారుల నుండి భారీ ఎత్తున స్పందన లభించిందని, యువ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారని వివరించారు. మానవ సమగ్ర అభివృద్ధి క్రీడా ద్వారానే సాధ్యమవుతుందన్న సందేశాన్ని ఈ క్రీడా పోటీల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పోరేషన్ చైర్మన్లు పల్లె రవికుమార్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, బిసి కమిషన్ సభ్యుడు కిషోర్ గౌడ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్‌లు అతిథులుగా హాజరైనారు. తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మల్లారెడ్డి, దత్తాత్రేయ వెటర్న్ సైక్లిస్ట్ మర్రి లక్ష్మారెడ్డి,



తెలంగాణ రోలల్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సిహెచ్ సురేష్, నిర్మల్‌సింగ్, రెజ్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు నర్సింగ్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రేమ్‌రాజ్, ప్రభుత్వ ఫిజికల్ కళాశాల ప్రిన్సిపల్ రామిరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు రవీందర్, గోకుల్, జితేందర్, జైపాల్, విజయభాస్కర్, సుధాకర్, శ్రీకాంత్, క్రీడా అధికారులు, క్రీడాభిమానులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215